సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 25 । మార్చి । 2025

ఇఫ్తార్ సహర్
మంగళ బుధ
6.12 4.41
రంజాన్ వేళలు

సాగర తీరంలో దంచికొట్టుడు


ఇరగదీసిన ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్ అశుతోష్ శర్మ(66 నాటౌట్)


స్టేడియం నిండుగా..




యువతి కేరింత

- ఉత్కంఠ పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ విజయం
- చివరివరకు పోరాడిన లక్నో సూపర్ జెయింట్స్
- క్రికెట్ ఫ్యాన్స్‌కు ఫుల్ పండగ

విశాఖ స్పోర్ట్స్ : సిక్సులు, ఫోర్ల సునామీ.. బంతి బంతికి నరాలు తెగే ఉత్కంఠ.. చివరి వరకు మ్యాచ్ ఇరువైపులా దోబూచులాట.. క్రికెట్ అభిమానులకు ఇంకేం కావాలి. ఫుల్ పండగే. డాక్టర్ వైఎస్ఆర్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో సోమవారం జరిగిన ఐపీఎల్ తొలి మ్యాచ్ ఫ్యాన్స్‌కు మస్తు మజా ఇచ్చింది. తొలుత లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్లు ఆధిపత్యం చూపించగా.. ఆ తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్లు తామేం తక్కువ కాదన్నట్లుగా అద్భుత షాట్లతో అలరించారు. బ్యాటర్లు సిక్సులు, ఫోర్లు దంచికొట్టగా ఫ్యాన్స్ హోరు అంబరాన్ని తాకింది. అభిమానుల కేరింతలతో స్టేడియం హోరెత్తింది. లక్నో సూపర్ జెయింట్స్ **జట్టు 20 ఓవర్లకు 209/8 పరుగు చేయగా.. ఢిల్లీ క్యాపిటల్స్ 211/9 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. ఆఖరి వరకు ఉత్కంఠగా** సాగిన మ్యాచ్ అభిమానులకు ఫుల్ కిక్ ఇచ్చింది. ఈ మ్యాచ్‌ను రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రత్యక్షంగా వీక్షించారు. ఢిల్లీ క్యాపిటల్స్ తన రెండో మ్యాచ్‌ను డాక్టర్ వైఎస్ఆర్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలోనే ఈనెల 30న సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో తలపడనుంది.


కుల్దీప్‌తో అక్షర్ పటేల్


డ్రమ్‌రే డ్రమ్


విజయ కేతనం






ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు మద్దతు తెలుపుతూ ఫ్యాన్స్ సందడి


పాపాహోమ్ బాలలతో కలిసి మ్యాచ్ తిలకిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ


చీర్ గర్ల్స్ హంగామా


స్టేడియంలో కోలాహలం



న్యూస్‌రీల్

పుష్పయాగానికి పూలు తరలింపు


సంకల్పం చేసిన పుష్పాలతో భక్తులు

ఎంవీపీ కాలనీ: కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి పుష్పయాగానికి విశాఖ నుంచి పూలు తరలివెళ్లాయి. కార్తీక దినోత్సవ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సేకరించిన పూలు యాగానికి పంపించారు. సోమవారం ఉదయం ఎంవీపీ కాలనీలోని టీటీడీ ఈ– దర్శనం కౌంటర్ వద్ద భక్తుల సందర్శనార్థం ఈ పూలను ప్రదర్శించారు. తొలుత మహిళ భక్తులు పూలను అందంగా తీర్చిదిద్ది ప్యాకింగ్ చేశారు. అనంతరం సంకల్పం చేసి శాస్త్రోక్తంగా పుష్పయాగం కొరకు తిరుమలకు ఈ పూలు తరలించారు. వీటిలో 4వేల కలువలు, 2 వేల తామరలతో పాటు వివిధ రకాలకు చెందిన పూలు ఉన్నట్లు అధ్మాతిక వేత్త హిమాన్షు ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి గ్రంధి రాజేష్, టీటీడీ ప్రతినిధులు పాల్గొన్నారు.

28న స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె



ఉక్కునగరం: ఇటీవల తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను ఈనెల 26వ తేదీన రీజనల్ లేబర్ కమిషనర్‌తో జరగనున్న చర్చల నాటికి విధుల్లోకి తీసుకోకపోతే ఈనెల 28న సమ్మె చేస్తామని ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు నిర్ణయించాయి. సోమవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఈ మేరకు తెలిపారు. ఇప్పటికే వెయ్యి మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారన్నారు. వీరిలో అత్యధికంగా నిర్వాసితులు, స్థానికులు ఉన్నారన్నారు. మరోవైపు 45 ఏళ్లు దాటిన వారికి వైద్య పరీక్షలకు పంపించి వారి పాసులు నిలిపివేయడం దుర్మార్గమన్నారు. ఉపాధి రక్షణ కోసం ఈనెల 28న ఉదయం 6 నుంచి 29వ తేదీ ఉదయం 8 గంటల వరకు విధులు బహిష్కరించి ఆ రోజంతా అడ్మిన్ బిల్డింగ్ వద్ద నిరసన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

కార్మికులు వడదెబ్బకు గురికాకుండా చర్యలు

సీతంపేట: రాష్ట్ర కమిషనర్ ఆఫ్ లేబర్ ఆదేశాల మేరకు అన్ని రంగాల్లో పనిచేసే కార్మికులకు వడ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జాయింట్ లేబర్ కమిషనర్ ఎం.రామారావు అధికారులను, వివిధ సంస్థల యాజమాన్యాలను ఆదేశించారు. అక్కయ్యపాలెంలోని కార్మిక శాఖ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతలు ఉన్న సమయాల్లో (మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు) పనిని తగ్గించి ఇతర సమాయాలకు మార్పు చేయాలని సూచించారు. పని ప్రదేశాల్లో మంచి నీటి సదుపాయం కల్పించాలని, ఆరోగ్య శాఖతో సమన్వయం చేసుకుని కార్మికుల ఆరోగ్య పరిస్థితిని క్రమం తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు ఐస్ ప్యాక్‌లు, చల్లని నీరు, ఇతర రక్షణ సామగ్రి అందుబాటులో ఉంచాలన్నారు. నీడనిచ్చేలా షెడ్లు, నీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్ వంటి అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎం.సునీత పాల్గొన్నారు.

డీఎస్సీ ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ : డీఎస్సీ (ఎస్జీటీ) అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు సర్దార్ గౌతు లచ్చన్న బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.శ్రీదేవి తెలిపారు. బీసీ, ఈడబ్ల్యూసీ వర్గాల అభ్యర్థులు అర్హులని, వారి వార్షిక ఆదాయం రూ.2 లక్షల లోపు ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు సర్టిఫికెట్లతో పాటు టెట్ మార్కుల లిస్ట్, కుల, ఆదాయ ధృవపత్రాలు ఎంవీపీ కాలనీలోని సర్దార్ గౌతు లచ్చన్న బీసీ స్టడీ సర్కిల్‌లో అందజేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 94925 69177 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

స్పాట్‌కు డుమ్మాపై సీరియస్..!

- ఇంటర్ మూల్యాంకనానికి హాజరుకాని 180 మందికి షోకాజ్ నోటీసులు
- అధ్యాపకులను పంపేందుకు నిరాకరిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు



విశాఖ విద్య : ఇంటర్మీడియెట్ స్పాట్ వాల్యూయేషన్‌కు కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీ అధ్యాపకులు డుమ్మా కొడుతున్నారు. ముందస్తు ఉత్తర్వులు జారీ చేసిన అధ్యాపకులంతా తప్పనిసరిగా హాజరు కావాల్సిందేనని నేరుగా ఆర్ఐవో హెచ్చరించినా పెడచెవిన పెడుతున్నారు. దీంతో మూల్యాంకనం ప్రక్రియ జాప్యమవుతుండటంతో ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. మూల్యాంకనం విధులకు హాజరు కాని 180 మంది అధ్యాపకులను గుర్తించి, వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తీరు మార్చుకోకుంటే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

జిల్లాకు 3.50 లక్షల జవాబు పత్రాలు

విశాఖలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతోంది. వివిధ జిల్లాల నుంచి సుమారు 3.50 లక్షల జవాబు పత్రాలు ఇక్కడకు వచ్చాయి. ఇందుకోసం 1,200 మంది అధ్యాపకులను ఎగ్జామినర్, చీఫ్ ఎగ్జామినర్లుగా నియమించారు. సోమవారం నాటికి 1.80 లక్షల మేర జవాబు పత్రాలను మూల్యాంకనం చేసినట్లు ఆర్ఐవో మురళీధర్ తెలిపారు. ఏప్రిల్ 4వ తేదీ నాటికి మూల్యాంనకం పూర్తి చేయాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఐవో మురళీధర్ ప్రత్యేక దృష్టి సారించారు.

యాజమాన్యాల నిర్లక్ష్యం

జిల్లాలోని కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థులకు నీట్, ఏపీ ఈఏపీ సెట్, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్న కారణంగా అధ్యాపకులను రిలీవ్ చేయకుండా.. స్పాట్ వాల్యూయేషన్‌కు కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలు మోకాలడ్డుతున్నాయి. సబ్జెక్టుల వారీగా స్పాట్ వాల్యూయేషన్ విధులకు నియమించిన అధ్యాపకులు పూర్తిస్థాయిలో విధులకు హాజరు కావడం లేదు. స్పాట్ వాల్యూయేషన్ విధులకు బోర్డు ద్వారా ఆర్డర్లు అందుకున్న అధ్యాపకులు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా.. డుమ్మా కొట్టడంపై ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు.

కఠిన చర్యలు



స్పాట్ వాల్యూయేషన్ విధులకు గైర్హాజరవుతున్న అధ్యాపకులకు షోకాజ్ నోటీసులు జారీ చేశాం. యాజమాన్యాలకు కూడా లేఖలు రాశాం. ఇలాగే కొనసాగితే రోజుకు రూ.వెయ్యి చొప్పున ఆయా కాలేజీ యాజమాన్యాలకు జరిమానా విధిస్తాం. బోర్డు అధికారులు నిర్దేశించిన గడువులోగా మూల్యాంకనం పూర్తి చేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. –పి.మురళీధర్, ఆర్ఐవో

మరోసారి మెట్రో మొబిలిటీ ప్లాన్

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, విశాఖపట్నం : కూటమి ప్రభుత్వం తీసుకున్న అడ్డగోలు నిర్ణయం కారణంగా.. మరోసారి మెట్రో మొబిలిటీ ప్లాన్ తయారు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైజాగ్ మెట్రోకు సంబంధించిన డీపీఆర్ సిద్ధం చేసి అప్రూవల్ కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. అయితే.. ప్రభుత్వం మారిన తర్వాత సీఎం చంద్రబాబు.. పాత డీపీఆర్‌ని వెనక్కి తీసుకుంటున్నామని.. కొత్తగా కొన్ని మార్పులు చేర్పులు చేసి డీపీఆర్ సిద్ధం చేస్తామని చెప్పడంతో.. ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఈలోగా మెట్రో కోసం ముందుగా తయారు చేసే కాంప్రిహెన్సివ్ మొబిలిటీ ప్లాన్(సీఎంపీ) గడువు ముగిసిపోయింది. ప్రతి ఐదేళ్లకోసారి సీఎంపీ గడువు ముగిసిపోతుంటుంది. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సీఎంపీ కొత్తగా రూపొందించాలని సెంట్రల్ అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం కోరింది. దీంతో సీఎంపీ రూపకల్పనపై దృష్టిసారించిన ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎంఆర్‌సీఎల్) నిధులు మంజూరు చేసి టెండర్లు ఆహ్వానించింది. విశాఖలో రూ.84.47 లక్షలతో మొబిలిటీ ప్లాన్ రూపొందించే బాధ్యతను న్యూఢిల్లీకి చెందిన సిస్త ఎంవీఏ సంస్థకు అప్పగించింది. సిస్తకు లెటర్ ఆఫ్ ఏజెన్సీ(ఎల్‌వోఏ) బాధ్యతలు అప్పగిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వీఎంఆర్‌డీఏ పీపీపీ ప్రాజెక్టులకు కమిటీ

వీఎంఆర్‌డీఏలో చేపట్టబోతున్న ప్రాజెక్టుల ఆమోదానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రూ.10 కోట్ల కంటే ఎక్కువ విలువతో పీపీపీ తరహాలో చేపట్టబోయే ప్రాజెక్టులకు సంబంధించి ఆర్ఎఫ్‌పీ బిడ్స్, రాయితీ ఒప్పందాలు, లీజు, ఆపరేషన్, మెయింటెనెన్స్ ఒప్పందాలు మొదలైన వాటిని ఈ కాంపిటెంట్ అథారిటీ ఆమోదించాల్సి ఉంటుంది. వీఎంఆర్‌డీఏ కమిషనర్ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. మెంబర్లుగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అదనపు కార్యదర్శి, జీవీఎంసీ చీఫ్ ఇంజినీర్, ఏపీయూఎఫ్ఐడీసీ చీఫ్ ఇంజినీర్, వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజినీర్, వీఎంఆర్‌డీఏ ప్రాజెక్ట్స్ ఎస్ఈలు వ్యవహరించనున్నారు.

ఆస్తులపై సీబీఐ దర్యాప్తునకు సిద్ధం

- ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు సవాల్

ఉక్కునగరం : తమ ఆస్తులపై సీబీఐ విచారణకు సిద్ధమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు.. బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు సవాల్ విసిరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ నష్టాల్లోకి వెళ్లడానికి కార్మిక సంఘాల నాయకులే కారణమన, వారి ఆస్తులపై విచారణ చేయాలన్న ఆయన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. స్టీల్‌ప్లాంట్ నష్టాలకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలే కారణమన్నారు. 2019–20లో పూర్తి సామర్థ్యం ఉత్పత్తి సాధించే క్రమంలో మెకంజీ సంస్థతో అనేక మార్పులు చేసి బీఎఫ్–3ను పూర్తిగా మూసివేసే పరిస్థితి తీసుకొచ్చింది కార్మిక నాయకులా, యాజమాన్యమా, కేంద్ర ప్రభుత్వమా అని ప్రశ్నించారు. 2021 ఫిబ్రవరిలో ప్రైవేటీకరణ ప్రకటన తర్వాత ప్లాంట్‌కు రా మెటీరియల్ అందకుండా, రైల్వే ర్యాక్‌లు ఇవ్వకుండా అడ్డుకున్నది ఎవరో అందరికీ తెలుసన్నారు. గంగవరం పోర్టును అదానీకి అప్పగించి అందులో స్టీల్‌ప్లాంట్‌కు ఉన్న ప్రత్యేక బెడ్‌ను లేకుండా చేసిందెవరన్నారు. ఐఆర్ సమస్య సృష్టించి, 42 రోజుల పాటు సమ్మె చేయడంతో పాటు ప్లాంట్ ఉత్పత్తి పూర్తిగా తగ్గిపోయి రూ.300 కోట్లు నష్టం కలిగించింది తామా.. కేంద్ర ప్రభుత్వ పెద్దలా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధిగా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే మంచిదన్నారు. సాధ్యమైతే స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనంతోపాటు సొంత గనులు కేటాయించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తమకు సాయం చేయాలని పోరాట కమిటీ తరపున కన్వీనర్ కె.ఎస్.ఎన్.రావు కోరారు.

రీ ఓపెన్ అర్జీలపై కలెక్టర్ అసంతృప్తి

- సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలి
- జిల్లా పీజీఆర్ఎస్‌కు 309 వినతులు


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో డీఆర్వో భవానీ శంకర్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ

మహారాణిపేట : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలకు సత్వరం పరిష్కారం చూపాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలనుంచి అర్జీలను అధికార యంత్రాంగం స్వీకరించింది. ఫిర్యాదుదారులతో కలెక్టర్, ఇతర అధికారులు ముఖాముఖి మాట్లాడారు. సమస్యలు తెలుసుకున్నారు. సకాలంలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ పాల్గొన్నారు. అంతకు ముందు కలెక్టర్ హరేందిర ప్రసాద్ అధికారులతో భేటీ అయ్యారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సాధ్యమైనంత త్వరగా శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. జిల్లాలో రీ–ఓపెన్ అర్జీలు తరచుగా రావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా శాఖల వద్ద పెండింగ్ ఉన్న అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. వీఎంఆర్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈసందర్భంగా వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోస్టర్ ఆవిష్కరించారు. పీజీఆర్ఎస్‌లో 309 వినతులు వచ్చాయి. వీటిలో రెవెన్యూ శాఖకు 123, పోలీసు శాఖకు 36, జీవీఎంసీకి 88 ఉన్నాయి. ఇతర విభాగాలకు సంబంధించి 62 వినతులు వచ్చాయి.

పెందుర్తిలో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు


పెందుర్తి రైల్వే స్టేషన్ వద్ద పట్టాలు తప్పిన గూడ్సు రైలు

పెందుర్తి: పెందుర్తి రైల్వే స్టేషన్ సమీపంలో ఓ గూడ్సు రైలు సోమవారం పట్టాలు తప్పింది. విశాఖ పోర్టు నుంచి బొగ్గు లోడుతో పలాస వెళుతున్న ఈ గూడ్స్ రైలు పెందుర్తి రైల్వే స్టేషన్ దాటాక సరిపల్లి సమీపంలో ఒక్కసారిగా ఒరిగిపోయింది. మూడు వ్యాగన్లు ట్రాక్ తప్పాయి. దీంతో ఆ ప్రాంతంలో కాంక్రీట్ స్లీపర్లు ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు యుద్ధప్రాతిపదికన ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. పాసింజర్ రైళ్ల ట్రాక్‌లో రైళ్లు యథావిధిగా ప్రయాణం కొనసాగించాయి. గూడ్స్ ట్రాక్‌ను మంగళవారం నాటికి పునరుద్ధరిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

ప్రేమ పేరుతో మోసం.. ట్రాన్స్‌జెండర్ వినతి

పేరు లాస్య. మద్రిపాలెంలోని 104 ఏరియా. చేపలుప్పాడకు చెందిన అంబటి హరిష్ నేను ప్రమించుకున్నాం. పెళ్లి చేసుకుంటాననడంతో సహజీవనం చేశాం. నగదు, బంగారంతో పాటు ఇల్లు కూడా కట్టించి ఇచ్చా. చాలా కాలంలో ఇద్దరం ప్రేమలో ఉన్నాం. ఇటీవల హరీష్ ఇబ్బంది పెట్టడం మొదలు పెట్టాడు. నువ్వు ట్రాన్స్‌జెండర్‌వి..పిల్లలు పుట్టరు అంటూ దూరం పెట్టాడు. అన్ని విధాలుగా నష్టపోయిన నాకు న్యాయం చేయాలి..అని సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో లాస్య ఫిర్యాదు చేశారు. హరిష్‌పై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

– లాస్య, 104 ఏరియా, మద్రిపాలెం, విశాఖపట్నం

రీ సర్వేలో తప్పు పడిన పేరు సరిదిద్దాలి

రీ సర్వేలో తప్పుగా నమోదైన పేరు సరిదిద్దాలి. నా తాత ముత్తాతల నుంచి వారసత్వంగా పొందిన భూమిని సాగు చేసుకుంటున్నాం. ఆనందపురం మండలం గొట్టిపల్లి గ్రామంలో సర్వే నంబర్ 64/5లో 60 సెంట్లు భూమి ఉంది. ఈ పొలమే జీవనాధారంగా సాగు చేసుకుంటూ జీవిస్తున్నాం. పండిన పంటలు అమ్ముకొవడానికి మార్కెటింగ్ శాఖ ద్వారా నరసింహనగర్ రైతు బజార్‌లో కార్డును కూడా జిల్లా జాయింట్ కలెక్టర్ జారీ చేశారు. కాని అదే సర్వే నంబర్‌లో భూమిని కొరడా రుక్మిణి దేవి పేరు మీద తప్పుగా నమోదు అయ్యింది. అధికారులు న్యాయం చేయాలి.

– రౌతు కమల, కంతం వారి వీధి, అల్లిపురం

దివ్యాంగురాలి మౌనపోరాటం



నా పేరు నూకరత్నం స్వప్న ప్రియ. రావికమతం మండలం కొత్తకోట గ్రామం. విశాఖలోని ఓ హోటల్ పనిచేస్తున్న సమయంలో అదే హోటల్‌లో పనిచేస్తున్న పవన్‌కుమార్‌రెడ్డితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారింది. ఓ వైపు పనిచేస్తూనే మరో వైపు డిగ్రీ చదువుతున్నా. 2023లో పెళ్లి చేసుకుంటానని పవన్ చెప్పడంతో శారీరకంగా దగ్గరయ్యాం. చదువుకూడా మాన్పించేశాడు. ఉద్యోగం ప్రస్తుతం చేయడం లేదు. అయితే దివ్యాంగురాలిని అన్న కారణంగా ఇప్పుడు పెళ్లి చేసుకోనని మోసం చేశాడు. పవన్‌తో ప్రేమ కారణంగా అటు కుటుంబ సభ్యులు పట్టించుకోవడం లేదు. తనకు న్యాయం చేయాలంటూ కలెక్టర్ కార్యాలయం ఎదుట మౌన పోరాటానికి దిగింది.

– నూకరత్నం స్వప్న ప్రియ, కొత్తకొట గ్రామం, రావికమతం

చేతకానప్పుడు సూపర్ సిక్స్ ఎందుకు?


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న పీవోడబ్ల్యూ నేతలు

- ఓట్ల కోసమే పథకాల ఎర
- హామీలు అమలు చేయకపోతే ప్రజలకు కూటమి ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలి
- పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మి డిమాండ్

సీతమ్మధార : కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని, మద్య నిషేధం విధించాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపట్టామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలల అవుతున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నేటికీ అమలు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. ప్రత్యేకంగా మహిళలకు ప్రకటించిన ఆడబిడ్డ నిధి, దీపం పథకం, తల్లికి వందనం, ఉచిత బస్సు సౌకర్యం తదితర హామీలను నెరవేర్చాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం క్షమాపణలను చెప్పాలని డిమాండ్ చేశారు. యువగళం ద్వారా యువకులకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడం లేదా నెలకు రూ. 3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. వేంకటేశ్వర్లు, భీంసేనా వార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. చిన్నారావు, రాజేంద్రప్రసాద్, భారత నాస్తిక సమాజం జిల్లా ప్రధాన కార్యదర్శి నూకరాజు, ప్రొఫెసర్ సూరప్పడు మాట్లాడగా, మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం నగర కన్వీనర్ ఈసర లక్ష్మి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షులు డి.ఏడుకొండలు పాల్గొన్నారు. అరుణోదయ కళాకారులు సూపర్ సిక్స్ బండారాన్ని బయటపెట్టే పాటలను, మద్యం అమ్మకాలను నిషేధించాలని డిమాండ్ చేస్తూ పోరాట సందేశాన్ని ఇచ్చే పాటలు పాడారు. పీవోడబ్ల్యూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకేఎస్ రోహిణి దేవి, కార్యదర్శి ఇందిర, కోశాధికారి వరలక్ష్మి, కమిటీ సభ్యులు ఈసర లక్ష్మి, రూప, గీత, జయమ్మ పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తులను ఎలా గుర్తిస్తారో తెలుసా?


సెన్సార్ పనితీరు వివరిస్తున్న సిబ్బంది



ఉష్ణోగ్రతలు గణించే పరికరాలు


వర్షపాతం, ఉష్ణోగ్రతలు గుర్తించే పరికరాలు వివరాలు తెలియజేస్తున్న సిబ్బంది

- 1870 నుంచి విశాఖ వాతావరణ కేంద్రం సేవలు
- ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారం అందజేత

ఏయూక్యాంపస్: వాతావరణ విశేషాలంటూ రేడియోలో చెప్పినా, వెదర్ రిపోర్టు అంటూ టీవీల్లో వివరించినా, మరికొద్ది సేపట్లో పిడుగులతో కూడిన భారీవర్షాలు కురుస్తాయని సెల్‌ఫోన్‌కు అలెర్టు మెసేజ్ వచ్చినా..తాజా వాతావరణ సమాచారం సెల్‌ఫోన్ల స్క్రీన్లపై పాప్ అప్ అవుతున్నా వీరందరికీ ఆ వివరాలు, లెక్కలు, మ్యాపులతో కూడిన పూర్తి సమాచారాన్ని అందించేది వాతావరణ శాఖ మాత్రమే. మానవ జీవితాన్ని వాతావరణం ప్రభావితం చేస్తుంది. ఎండ, వాన, చలి ఇలా ప్రతీ కాలంలో కొన్ని ప్రత్యేకమైన పరిస్థితులు ఉంటాయి. ఇవి రైతులకు, మత్స్యకారులకు, విమానయాన, నౌకాయాన నిపుణులకు ఎంతో కీలకంగా నిలుస్తాయి. ఎప్పటికప్పుడు వీరికి అవసరమైన కచ్చితమైన వివరాలను, సమాచారాన్ని అందించే వ్యవస్థ ఉండటం ఎంతో కీలకం. నేటి సాంకేతిక యుగంలో వాతావరణ మార్పులను కచ్చితంగా గుర్తించి, గణించి సమగ్రంగా అందించే వ్యవస్థను కలిగి ఉంది విశాఖలోని తుఫాను హెచ్చరికల కేంద్రం.

భారత వాతావరణ శాఖకు అనుబంధంగా తుఫాను హెచ్చరికల కేంద్రం సేవలు అందిస్తోంది. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతానికి సంబంధించిన వాతావరణం, తుఫాను పరిస్థితులు, ప్రభావం, తుఫాను హెచ్చరికలు జారీ వంటి సేవలను ఈ కేంద్రం అందిస్తుంది. ఇతర వాతావరణ సంబంధ అంశాలు, సమాచారాన్ని అమరావతిలో ఉన్న వతావరణ విభాగం అందిస్తుంది.

తుఫాను సమాచారం

విశాఖలో ఉన్న వాతావరణ కేంద్రాన్ని తుఫాను హెచ్చరికల కేంద్రంగా వ్యవహరిస్తారు. తుఫానులు వచ్చిన సందర్భంలో ఆంధ్రప్రదేశ్ తీరంలో జరిగే మార్పులు ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి ప్రజలకు సంబంధిత శాఖలకు అందించే కీలకమైన బాధ్యతలు ఈ కేంద్రం నిర్వహిస్తోంది. మత్స్యకారులకు, పోర్టులకు, ప్రభుత్వ యంత్రాంగానికి, విపత్తు నిర్వహణ బృందాలకు, రెవెన్యూ విభాగానికి ఈ సమాచారం అందిస్తారు.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో..

అల్పపీడనం, వాయుగుండం, తుఫాను ఏర్పడే అవకాశాన్ని వారం రోజుల ముందు నుంచి గుర్తించే సాంకేతికతలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. న్యూమరికల్ వెదర్ ప్రెడిక్షన్ మోడల్స్ నుంచి ఉపయోగించి వీటిని గణిస్తారు. తుఫాను ఏర్పడిన సమయంలో ప్రతీ మూడు గంటలకు ఒకసారి, తీరానికి చేరే సమయంలో ప్రతీ గంటకు ఒకసారి బులెటిన్ విడుదల చేస్తారు. అదే విధంగా ఉరుములు, పిడుగులు పడే అవకాశాన్ని కూడా వీరు గుర్తించి అప్రమత్తం చేస్తుంటారు. నగర వాతావరణం కూడా వీరు అంచనా వేస్తుంటారు.

ప్రతి రోజూ బులెటిన్

ప్రతీ రోజు వాతావరణ బులెటిన్‌ను విడుదల చేస్తూ ప్రజలకు అవసరమైన సమాచారాన్ని చేరువ చేస్తున్నారు. ఇక్కడ 40 మంది వరకు సాంకేతిక సిబ్బంది, వాతావరణ నిపుణులు సేవలు అందిస్తున్నారు. జీపీఎస్ సాండ్ పరికరాలను ఉపయోగించి ఉదయం సాయంత్రం వేళల్లో సెన్సార్ కలిగిన బెలూన్లను గాలిలోకి విడుదల చేసి ఉష్ణోగ్రత, హ్యూమిడిటీ, గాలి దిశ, గాలి వేగం, ఒత్తిడి వంటివి తెలుసుకుంటారు. రెయిన్ గేజ్ పరికరంతో వర్షపాతం శాతం గణిస్తారు. అదే విధంగా అత్యల్ప, అత్యధిక ఉష్ణోగ్రతలను గణించడం పిఆర్ 30 రెడ్‌బెలూన్‌తో ఉదయం సాయంత్రం రెండు పర్యాయాలు భూ ఉపరితలంలో 7.5 కిలోమీటర్ల పై భాగం వరకు గాలి వేగం, దిశలను తెలుసుకుంటారు. ఇవి విమానయానానికి ఎంతో అవసరం, అదే విధంగా గాలి వేగం, గాలి దిశను గుర్తించే ప్రత్యేక పరికరాలు ఇక్కడ ఉన్నాయి.

సేవలు ఇలా..

భూ ఉపరిత వాతావరణాన్ని పరిశీలించే అబ్జర్వేటరీలలో విశాఖలో 1870లో స్థాపించిన అబ్జర్వేటరీ పురాతనమైనది. తరువాత కాలంలో 1940లో దీనిని మహారాణిపేటకు మార్చు చేశారు. కిర్లంపూడిలో ఉన్న ప్రస్తుత భవనం 1970లో నిర్మించారు. రేడియో సాండ్ యూనిట్ 1971లో ఏర్పాటైంది. 1982లో సర్ఫేస్ అబ్జర్వేటరీ ప్రస్తుత భవనంలో ఏర్పాటయింది. 2017 నుంచి నౌకాస్ట్ సేవలు, 2020లో ఇన్‌స్పెక్టరేట్ విభాగం, 2021 నుంచి వ్యవసాయ సంబంధ సలహాలు అందించే విభాగం విశాఖ నుంచి సేవలు ఆరంభించింది. 2006లో కైలాసగిరిపై డాప్లర్ వెదర్ రాడార్‌ను ఏర్పాటు చేశారు.

ప్రత్యేక ప్రదర్శన


ప్రదర్శనలో ఉంచిన పోస్టర్లు

వాతావరణంతో నిత్యం అనుబంధం, అనుసంధానం కలిగిన విశాఖలోని వాతావరణ అధ్యయన కేంద్రంలో ప్రత్యేకంగా ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రజలకు అవగాహన కల్పించడం, వాతావరణ శాస్త్ర విభాగ ప్రాధాన్యతను ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు. వాతావరణ కేంద్రంలో ఉపయోగించే వివిధ సాంకేతిక ఉపకరణాలు, తుఫానులు, మేఘాలు, గాలి దిశ, వేగం తదితర అంశాలను తెలిపే పోస్టర్లతో ప్రత్యేక ప్రదర్శను నిర్వహించారు.

డ్రోన్ టెక్నాలజీ శిక్షణపై ఒప్పందం


డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ ఇచ్చేందుకు బీఎస్ఎన్ఎల్, రోసేస్ సంస్థల మధ్య ఒప్పందం చేసుకుంటున్న అధికారులు

అల్లిపురం: డ్రోన్ టెక్నాలజీ శిక్షణపై బీఎస్ఎన్ఎల్, రోసిస్ వర్చువల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య ఒప్పందం కుదిరాయి. సోమవారం బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ పీజీఎం పి.పాల్ విలియం, డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ ఎం.సత్యప్రసాద్, డీజీఎం శ్రీకాంత్ పట్నాయక్, ఏజీఎంలు, ఏజీఎం (ట్రైనింగ్) బీఎస్ శ్రీనివాస రావు, రోసేస్ వర్చువల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, సీఈవో ఎస్.కె.సతీష్, అధ్యక్షుడు డాక్టర్ ఓఆర్ఎం రావు, డ్రోన్ పైలట్ శిక్షకుడు ఎ.చైతన్య, దినేష్‌లు ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా పీజీఎం పి.పాల్ విలియం మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్, అండర్ గ్రాడ్యుయేషన్, పీజీ ప్రోగామ్‌లలో నైపుణ్యాభివృద్ధిపై ఇరు కంపెనీల మధ్యం అవగాహన ఒప్పందం జరిగిందన్నారు. విశాఖలో సాంకేతిక కోర్సులలో బీఎస్ఎన్ఎల్ శిక్షణ అందిస్తుందన్నారు. ఇంటర్న్‌షిప్, ప్రాజెక్టు వర్కుల ద్వారా విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి పెంపొందించేందుకు బీఎస్ఎన్ఎల్ రీసెర్చ్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వాటికి తోడుగా కళాశాల, విశ్వవిద్యాలయాల ఇంజనీరింగ్ విద్యార్థులకు అదనంగా డ్రోన్ టెక్నాలజీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కమాండ్ కంట్రోల్ మానిటరింగ్‌తో పాటు ఏఐ అప్లికేషన్‌లతో కూడిన పాఠ్యాంశాలు సహాయ పడతాయన్నారు. ఏఐ, లాట్, ఎం2ఎం అప్లికేషన్‌లతో పాటు జనరేటివ్ ఏఐ ఒక భారీ మార్పునకు దారితీస్తుందన్నారు. భవిష్యత్‌లో విభిన్నమైన అప్లికేషన్లతో విద్యా రంగం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. నైపుణ్యాన్ని మరింతగా అందించడానికి రోసేస్ సంస్థ తమ ఫ్యాకల్టీల ద్వారా మరింత బలోపేతం చేస్తుందన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of our clients Somapudi Sankara Rao S/o Late Atchiyya, resident of Flat No. 16, Sai Lakshmi Apartments, B.S.Layout, Visakhapatnam-530013, this public notice is being issued.

Public are hereby informed that one S.Narayanamma, who is the mother of our client acquired the property from her vendor S.Kameswaramma by way of Sale Deed 1736/1956 dated 08-07-1956 and the said original sale deed was missing / lost while our clients was travelling from Boyapalem to Yendada, and the same was reported to the SHO Pothinamallayyapalem Police Station through Meeseva vide its Application No MLAD012500513408 dated 24-03-2024 and the said application was pending before the police for investigation. Therefore, the Public are hereby requested if anyone found the said lost document, kindly contact the Phone numbers or address mentioned hereunder or kindly submit the same before the Pothinamallayyapalem Police Station.

D.NAGESWARA RAO & K.Y.V.N.A. SUDHA MADHURI
Advocates, Off: Shop No. 3, D.No. 55-15-22/44, H.B.Colony Last Busstop, Krishna College Road, Visakhapatnam-530022, 9703430509, 9676303007

సూర్యనారాయణ మాస్టారు కన్నుమూత

- పలువురు ప్రముఖులు, ఉపాధ్యాయుల సంతాపం


సూర్యనారాయణ మాస్టారు(ఫైల్)

పెందుర్తి: జాతీయ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బయిలపూడి సూర్యనారాయణ (85) (సూర్యనారాయణ మాస్టారు)కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం రాత్రి 11.30 సమయంలో పెందుర్తి మండలం పినగాడిలోని స్వగృహంలో తుది శ్వాస విడిచారు. మాస్టారుగా సుపరిచులైన సూర్యనారాయణ వరుసగా రాష్ట్ర, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు సాధించారు. 1990 దశకంలో తెలుగు వాచకం రూపొందించిన రచనా బృందంలో సభ్యుడిగా సూర్యనారాయణను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. సేవా భావంలో ముందుండే సూర్యనారాయణ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సమయంలో ఉచితంగా ట్యూషన్లు చెప్పేవారు. హెచ్‌ఎంగా పదవీ విరమణ తరువాత కూడా స్వచ్ఛంధంగా పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు పాఠాలు చెప్పడం వారి సందేహాలను నివృత్తి చేసేవారు. సూర్యనారాయణ భార్య ఇటీవలే మృతి చెందారు. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరామ్ పినగాడి సర్పంచ్‌గా మూడు సార్లు సేవలందించగా..కోడలు వెంకటలక్ష్మి ప్రస్తుతం సర్పంచ్‌గా ఉన్నారు. జయరామ్‌ను వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్, రాష్ట్ర అయిల్ ఫెడ్ చైర్మన్ గండి బాబ్జి, మాజీ ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, పలువురు అధికారులు పరామర్శించారు.


జయరామ్‌ను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

ఐఎన్ఎస్ విస్తర్ సీ ట్రయల్


ఎయిర్, మిక్స్ గ్యాస్ డైవింగ్ సిస్టమ్స్ ట్రయల్స్ పూర్తి చేసిన షిప్‌యార్డ్ సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం : ఐఎన్ఎస్ నిస్తార్ తుది సీట్రయల్‌ని సోమవారం విశాఖలో నిర్వహించారు. ఎయిర్, మిక్స్ గ్యాస్ డైవింగ్ సిస్టమ్స్, అబ్జర్వేషన్ క్లాస్ రిమోట్‌లీ ఆపరేటెడ్ వెహికల్ పనితీరుపై ట్రయల్స్ జరిగాయి. ఇందులో ఏర్పాటు చేసిన ఎయిర్/మిక్స్ డైవింగ్ కాంప్లెక్స్ షిప్ 75 మీటర్ల లోతువరకు డైవింగ్ చేయడానికి వీలు కల్పిస్తుంది. నీటి అడుగున డైవింగ్ సర్వేలు, తనిఖీలు నిర్వహించేందుకు ఇది కీలకంగా వ్యవహరిస్తుంది. సముద్ర గర్భం నుంచి 15 టన్నుల బరువుని ఎత్తేందుకు ఓడలో ఉపయోగించే మెరైన్ క్రేన్ కూడా ఇందులో ఏర్పాటు చేశారు. దానికి సంబంధించిన ట్రయల్స్ కూడా పూర్తి చేశారు.

'ప్రసాద్' పనులు వేగవంతం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో జరిగే ప్రసాద్ పథకం పనులు వేగవంతంగా చేయాలని, అలాగే క్వాలిటీ విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ టూరిజంశాఖ అధికారులకు సూచించారు. రూ. 54కోట్లతో సింహగిరిపైన, కొండదిగువ జరుగుతున్న ప్రసాద్ స్కీమ్ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. పనుల్లో జాప్యం వాస్తవమేనన్నారు. పనుల్లో మార్పులు చేర్పులు జరగడంతోను ఈ సమస్య తలెత్తిందన్నారు. వచ్చేనెల 30న చందనోత్సవం సందర్భంగా ఆ సమయానికి నిర్మాణంలో ఉన్న క్యూకాంప్లెక్స్ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అంతకుముందు మంత్రి ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాన్ని దేవస్థానం ఈవో కె.సుబ్బారావు అందజేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

■ 2BHK 1075 Sft S/F with Cupboard Carparking and lift, 24hrs Water Facility. for Sale at Sivajipalem. Ph: 93913 80232 [SCA25002273]

■ ద్వారకానగర్ ప్రైమ్ లోకేషన్‌లో 3BHK 1650 Sft. & 2 BHK 850 Sft. Flats అమ్మకానికి కలవు. ఫోన్ : 85999 96668 [SCA25002277]

HOUSE FOR SALE

■ సులభ వాయిదా పద్ధతిలో ఇండిపెండెంట్ ఇల్లు (గ్రౌండ్ ఫ్లోర్) విజయనగరం లోకల్, కార్పొరేషన్ పరిధిలో 167 చ॥గ॥ వుడా అప్రూవ్ స్థలంలో 2BHK ఇల్లు కేవలం 38 లక్షలు మాత్రమే అతి తక్కువ వడ్డీ రేటుతో 90% బ్యాంకు లోన్ సదుపాయం కలదు. 9391873337, 8143333494 [SCA25002248]

COMMERCIAL SPACE FOR RENT

■ 3800 Sqr Feet 1st Floor D. No: 1-83-10/1 HIG - 98, Sector -1, MVP Colony, Opp. to House of Spice. Ph : 98663 33203, 98492 58010 [SCA25002335]

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర: 98484 88068/ 77992 23300 [V- 13197]

Wanted

■ Universal Company నందు వర్క్‌చేయుటకు స్త్రీ/పు కావలెను. శాలరీ: 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95504 67459 [G-172]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీ: 20K. Ph : 8977639663, 8977639662 [HA-1904]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్
లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16.
విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా + అల్లూరి జిల్లా : నాలుగు లైన్లు రూ. 475/-
అదనపు లైను రూ. 100/- + 5% జి.ఎస్.టి. అదనం.
మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:

మురళీనగర్, మాధవధార	90101 33346
NAD, కంచరపాలెం	90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ / MVP కాలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	97059 33394

27 నుంచి విశాఖ జాతీయ నాటకోత్సవాలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీవీ రమణమూర్తి

సీతంపేట: అంతర్జాతీయ నాటక దినోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 27, 28, 29 తేదీల్లో 'లీడర్ విశాఖ జాతీయ నాటకోత్సవాలు-2025' కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించనున్నట్టు రైటర్స్ అకాడమి చైర్మన్ వీవీ రమణమూర్తి తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నాటకోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో పేరు వచ్చేలా నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మార్చి 27న గుజరాత్‌కు చెందిన రచయిత అర్పిల్ దాగత్ దర్శకత్వంలో 'ఐటెం' నాటకం, 28వ తేదీన అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన రికెన్‌న్గోముల్ దర్శకత్వంలో 'ద సేల్ ఆఫ్ లైఫ్' నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. 29న కేరళకు చెందిన మలయాళ దర్శకులు హిన్నం టోంబో దర్శకత్వంలో 'ద టైగర్ మ్యాన్' ప్రదర్శన ఉంటుందన్నారు. తొలిరోజు ప్రదర్శనకు ముఖ్య అతిథిగా ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు పాల్గొంటారని తెలిపారు. ఉచిత ఎంట్రీ పాస్‌ల కోసం 9849414758, 9676040165 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో ప్రొఫెసర్ కేవీఎల్‌డీ ప్రసాద్, డాక్టర్ వేమలి త్రినాథరావు, నాటక దర్శకుడు చలసాని కృష్ణప్రసాద్, రచయిత్రి రాధారాణి, నవరస థియేటర్ కార్యదర్శి నవరస మూర్తి, ప్రముఖ కవి చిన సూర్యారావు పాల్గొన్నారు.

ఉక్కునగరంలో పాముల హల్‌చల్


పట్టుకున్న పాములతో కిరణ్‌కుమార్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని వివిధ సెక్టార్లలో పాములు హల్‌చల్ చేశాయి. సకాలంలో స్నేక్ క్యాచర్ రొక్కం కిరణ్‌కుమార్ వచ్చి ఒకే రోజు మూడు పాములను పట్టుకున్నాడు. స్టీల్ ప్లాంట్ సెక్టార్-4లోని 114 బి క్వార్టర్‌లో హాలుగా గోధుమ నాగు కనిపించింది. వెంటనే ఆ కుటుంబీకులు బయటకు పరుగులు తీశారు. అదే విధంగా సెక్టార్-6లో 140 బి క్వార్టర్‌లో ఇంటి గుమ్మం పక్కన పాము కనిపించింది. సెక్టార్-11లోని 422 క్వార్టర్‌లో పాత సామాన్ల కింద పాము కనిపించింది. వెంటనే కిరణ్‌కుమార్‌కు సమాచారం అందించారు. కిరణ్‌కుమార్ ఆయా క్వార్టర్లకు చేరుకుని అందులోని మూడు పాములను పట్టుకున్నాడు. ఫారెస్ట్ రేంజర్ శాస్త్రి సమక్షంలో కిరణ్‌కుమార్ వాటిని కంబాల కొండ అటవీ ప్రాంతంలో విడిచిపెట్టాడు.

ప్రశాంతంగా న్యాయవాదుల సంఘం ఎన్నికలు

విశాఖ లీగల్ : విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికలు ప్రశ్నార్థకంగా మారాయి. ఈ నెల 28న జరగనున్న ఎన్నికలకు సంబంధించి న్యాయవాదుల సంఘం సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ అర్హత కలిగిన న్యాయవాదుల జాబితాను ప్రకటించారు. మొత్తం 2,970 మంది అర్హత కలిగిన న్యాయవాదులు ఉన్నారు. ఈ విషయమై ఎన్నికల అధికారి జి.ఎం.రెడ్డి ఇతర న్యాయవాదుల సభ్యులతో చర్చించారు. పైన పేర్కొన్న ఓటర్లతో పాటు మరో 700 మందిని కొత్తగా చేర్చారు. కొత్త ఓటర్లు వివరాలు స్పష్టంగా లేవు. బార్ కౌన్సిల్ ప్రకటించిన ఓటర్లతో పాటు కొత్తగా చేరిన ఓటర్లు మధ్య సమన్వయం లోపించింది. పాత ఓటర్లు కొంతమందికి అనుకూలంగా ఉండటంతో మరో వర్గం న్యాయవాదులు 700 మందిని అదనంగా చేర్చారు. సుదీర్ఘంగా చర్చలు జరిగిన తర్వాత న్యాయస్థానానికి వెళ్లడానికి కొంతమంది సంసిద్ధమయ్యారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని ఓటర్లు నిర్ణయాన్ని ప్రకటించడానికి మళ్లీ సమావేశం అవ్వాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది.

లాడ్జిలో యువకుడి ఆత్మహత్య


చిన్నారావు (ఫైల్)

గోపాలపట్నం: ఎన్ఏడీ జంక్షన్‌లో వేంకటేశ్వర లాడ్జిలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎయిర్ పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. 91వ వార్డు పాతగోపాలపట్నంలో దూసి చిన్నారావు (21) తల్లిదండ్రులతో నివాసముంటున్నాడు. ఇటీవల పెయింటింగ్ పనులు నిమిత్తం బెంగళూరు వెళ్లాడు. మూడు రోజుల క్రితం తిరిగి వచ్చి సొంత ఊరైన శ్రీకాకుళం వెళ్లాడు. ఆదివారం సాయంత్రం తిరిగి విశాఖ వచ్చాడు. అదే రోజు సాయంత్రం 7.30 గంలకు ఎన్ఏడీ జంక్షన్ వేంకటేశ్వర లాడ్జిలో 102 నంబర్ గదిలో దిగాడు. సోమవారం ఉదయం 10 గంటలకు కౌంటర్‌లో వాటర్ బాటిల్ తీసుకున్నాడు. గదిలోకి వెళ్లిన చిన్నారావు చాలా సేపటి నుంచి బయటకు రాలేదు. గది శుభ్రం చేసేందుకు బాయ్ వెళ్లగా..చిన్నారావు ఊరేసుకుని మృతి చెంది ఉండడాన్ని గుర్తించాడు. వెంటనే లాడ్జీ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సీఐ ఉమా మహేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి గణేష్ సెంట్రింగ్ పనులు చేస్తుండగా... తల్లి కూలీ పను చేస్తూ జీవిస్తున్నారు. మృతుడు సోదరి దుర్గా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 85 ఫిర్యాదులు


బాధితుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 85 ఫిర్యాదులు వచ్చినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. 85 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను నేరుగా పోలీస్ కమిషనర్‌కు అందజేశారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్య భర్తల గొడవలు, మోసానికి సంబంధించినవి, సివిల్ కేసుల ఫిర్యాదులు ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా సమస్యలను సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సమస్య పరిష్కారానికి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

వైద్య మిత్రల నిరసన

మహారాణిపేట: సమస్యల సాధన కోసం ఏపీ వైద్య మిత్ర కాంట్రాక్టు ఉద్యోగులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట శాంతియుతంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఏపీ వైద్య మిత్ర కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్, యూనియన్, వైద్య సేవలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఆరోగ్య మిత్రలు గత కొద్ది రోజులు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోతే ఈనెల 27 నుంచి ఆందోళన ఉధృతం చేస్తామని, 27న అమరావతిలో ఆందోళన చేస్తామని జిల్లా అధ్యక్షురాలు నాగమల్లీశ్వరి,సెక్రటరీ అప్పలరాజు తెలిపారు.

ఆశ వర్కర్ల ఆందోళన

మహారాణిపేట: తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని, న్యాయబద్ధమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్లు కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వారు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షురాలు పి.మణి మాట్లాడుతూ పనిభారం తగ్గించాలని, జాబ్ చార్ట్ ప్రకారం తగిన పని కేటాయించాలని కోరారు. ఎండల తీవ్రత రీత్యా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేయడానికి అవకాశం కల్పించాలని కోరారు. అధ్యక్షురాలు బి.పద్మ, యూనియన్ కార్యదర్శి వి.మేరీ, పలువురు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పది పరీక్షలకు 129 మంది గైర్హాజరు

విశాఖ విద్య: జిల్లాలో సోమవారం నిర్వహించిన పదో తరగతి గణితం పరీక్షకు 129 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 28,980 మంది విద్యార్థులకు గాను 28,851 మంది హాజరైనట్లు డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర అబ్జర్వర్ దేవానంద రెడ్డి జిల్లాలోని నాలుగు కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లాలోని 15 కేంద్రాల్లో జరుగుతున్న ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షకు సోమవారం 92 మంది గైర్హాజరయ్యారు.

'స్కై'లైట్



సూర్యోదయం, సూర్యాస్తమయాలు వీక్షించి తీరాల్సిందే. సూర్య కిరణాలు మేఘాలను చీల్చుకుంటూ ప్రయాణించే సమయంలో విభిన్న కాంతులను ప్రసరిస్తుంది. పొద్దుపోయే సమయంలో చందమామకు ఫోకస్ లైట్ వేసి దారి చూపినట్టు ఉందీ దృశ్యం. సోమవారం సాయంత్రం బీచ్ రోడ్డులో రామకృష్ణ మఠం వద్ద ఆలయ గోపురం వెనుక భాగం నుంచి సూర్యుడు అస్తమిస్తున్న సమయంలో ఈ సుందర దృశ్యం ఆవిష్కృతమైంది.
–ఫొటో: సాక్షి ఫొటో గ్రాఫర్, విశాఖపట్నం

కారుపై కూలిన చెట్టు



అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లో సంగం ఆఫీస్ కూడలి సమీపంలో హఠాత్తుగా చెట్టుకూలడంతో అటుగా వెళ్తున్న ఒక కారు, బైకు ధ్వంసమయ్యాయి. చెట్టు కింద భాగం చెద పట్టడంతో బలహీనమై సోమవారం మధ్యాహ్నం వీచిన గాలికి కూలిపోయింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అలాగే అక్కడే ఉన్న బైకు కూడా ధ్వంసమైంది. స్థానికుల సమాచారంతో జీవీఎంసీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని చెట్టు తొలగించి మార్గం సుగమం చేశారు.
–సీతంపేట